కూరగాయల రైతులను ఆదుకోండి: రైతుసంఘం

ప్రజాశక్తి - పెనుగొండ

కూరగాయల రైతుల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం కోరారు. బుధవారం మండలంలో కూరగాయల రైతులను రైతుసంఘం నేతలు కలిశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలు చెప్పుకున్నారు. తామరాడలో గంగిరెడ్డి పుల్లయ్య, మరో నలుగురు కలిసి సాగు చేసిన దొండ పాదులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హరేరాం మాట్లాడుతూ ఉద్యాన శాఖ నుండి కూరగాయల రైతులకు ఎటువంటి సహకారమూ అందడం లేదన్నారు. కూరగాయల పంటలకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరలు కల్పించాలని, పంటలకు సబ్సిడీలు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్నాల వెంకట సూర్యనారాయణ, కౌరు జగన్నాథం, మామిడిశెట్టి వెంకట్రావు, కుసుమ ఏడుకొండలు, పెచ్చెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదు

విద్యుత్ విధానం మార్చుకోకపోతే ఐక్య ఉద్యమాలకు సిద్ధం

విద్యుత్ ఛార్జీలు తగ్గించి, అదనపు ఛార్జీలు రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో గళమెత్తిన వామపక్ష నేతలు

ధర్నాలో నినదిస్తున్న నేతలు, కార్యకర్తలు, ప్రజలు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజ్యావతిరేక విద్యుత్ విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. ప్రజలపై మరింత భారాన్ని మోపిన ఈ విద్యుత్ విధానం మార్చుకోకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని హెచ్చరించాయి. వామపక్షాల చరిత్ర గుర్తుంచుకుని మసులుకోవాలని ఖబడ్దార్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాయి. గత ప్రభుత్వాలకు పట్టిన గతే మీకూ పడుతుందని, రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చరమగీతం పాడుతామని వామపక్షాలు స్పష్టం చేశాయి. విస్సాకోడేరు పెదవంతెన సమీపాన సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని, అదనపు ఛార్జీలను రద్దు చేయాలని బుధవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వామపక్షాల నేతలు, కార్మికులు, సామాన్య ప్రజలు, విద్యుత్ వినియోగదారులు ఈ ధర్నాకు తరలొచ్చారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని, ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, అదనపు ఛార్జీలు తగ్గించాలని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని, స్మార్ట్‌మీటర్ల బిగింపు నిలిపివేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యుత్ బిల్లులు మోత మోగిస్తున్నాయన్నారు. యూనిట్ ఛార్జీని విపరీతంగా పెంచారని విమర్శించారు. గతంలో వినియోగించిన విద్యుత్‌కు ఇప్పుడు ఛార్జీలు విధించడం దుర్మార్గమన్నారు. 2000వ సంవత్సరంలో వామపక్షాలు ఐక్య ఉద్యమాలు నిర్వహించిన విషయం గుర్తు చేశారు. ఆ తరహా విద్యుత్ ఉద్యమానికి మరోమారు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫార్వర్డ్‌బ్లాక్, సిపిఐ పట్టణ కార్యదర్శులు శ్రీనివాసరాజు, చెల్లబోయిన రంగారావు, ఎంసిపిఐ(యు) నాయకులు చంటి మాట్లాడుతూ ప్రజలపై విపరీతమైన భారాలు మోపడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ తుంగలోకి తొక్కి విపరీతంగా ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం వామపక్షాల ముఖ్య నేతలు కలెక్టరేట్‌లోకి వెళ్లి ఎజికు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, కె.రాజారామ్మోహన్‌రాయ్, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, డి.కళ్యాణి, జుత్తిగ నరసింహమూర్తి, మామిడిశెట్టి రామాంజనేయులు, ఎం.వైకుంఠరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.ఆంజనేయులు, చైతన్య ప్రసాద్, సిపిఐ నాయకులు మల్లుల సీతారాం ప్రసాద్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ ర్యాలీ

గూడెం నుంచి భీమవరం వరకూ మోటారు సైకిల్ ర్యాలీ

తాడేపల్లిగూడెం: కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరిట విద్యుత్ ఛార్జీలు పెంచడాన్ని ఖండిస్తూ, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, అదనపు భారాలు రద్దు చేయాలని కోరుతూ భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నాకు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం నుండి భీమవరం వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, మడక రాజు, శిద్దిరెడ్డి శేషుబాబు, పతివాడ నాగేంద్రబాబు, మేట్రెడ్డి రమణ, గొర్రెల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరుకు కలిసి రావాలి

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచుకోమని లైసెన్స్ ఇచ్చింది. విద్యుత్ ఛార్జీల భారాలను ప్రజలపై మోపుతోంది. ఇష్టానుసారంగా కోతలు విధిస్తూ అదనపు ఛార్జీలు కూడా వేస్తుంది. ట్రూఅప్, ఫిక్స్, సర్దుబాటు ఛార్జీలు ఇలా ఏడు రకాల ఛార్జీలు వేస్తున్నారు. మరోపక్క కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ నూతన విద్యుత్ విధానం పేరుతో విద్యుత్ రంగంలో సంస్కరణలను అమలు చేస్తోంది. దీనిని మన రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోంది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా ఈ విధానాలను వ్యతిరేకిస్తుంటే మన రాష్ట్రం మాత్రం కేంద్ర ప్రభుత్వ విధానాలను నెత్తినేసుకుని మోస్తుంది. రైతులు, గృహ వినియోగదారులు, అన్ని రకాల ప్రజలు ఈ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. స్మార్ట్‌మీటర్లు బిగిస్తామని చెబుతున్నారు. దీంతో మరింత అదనపు భారం ప్రజలపై పడనుంది. ఇదే కొనసాగితే వ్యవసాయం మరింత సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచారు. గతంలో వామపక్షాల ఉద్యమంతో టిడిపి పదేళ్లపాటు నామరూపాలు లేకుండాపోయింది. వైసిపి ఇది గుర్తుంచుకోవాలి. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు అంతా కలిసి రావాలి.

ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలి

లంక కృష్ణమూర్తి, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి

వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తోంది. ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. ప్రత్యేక హోదా మాటే లేదు. ప్రజలపై భారాలను మాత్రం విపరీతంగా మోపుతున్నారు. విద్యుత్ ఛార్జీలు అత్యంత దారుణంగా పెంచడం దారుణం. తక్షణం అదనపు భారాన్ని రద్దు చేయాలి. అవసరమైతే అంతా ఏకతాటిపైకి వచ్చి ఐక్యంగా పోరాడలి. రాబోయ రోజుల్లో ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలి.

అప్పుల వీరుడు జగన్

చింతకాయల బాబూరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ హక్కులను హరిస్తున్నాయి. బిజెపి నియంతృత్వంగా వ్యవహరిస్తోంది. అప్పులు చేసుకునేందుకు బిజెపి అవకాశం కల్పించడంతో ముఖ్యమంత్రి జగన్ అప్పుల వీరుడయ్యాడు. తెలంగాణ, కేరళ, బిజెపి పాలిత రాష్ట్రాల్లో విద్యార్థి సంఘాలు, వామపక్షాల నేతలు ప్రజలపై భారాలను తిప్పికొడుతున్నారన్నారు.

రూ.50 వేల కోట్లు భారం పడింది

కోనాల భీమారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి

సంక్షేమం అందిస్తున్నామని గొప్పలు చెబుతూనే ప్రభుత్వం ప్రజలపై భారాలను మోపుతోంది. వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో రూ.50 వేల కోట్లు ప్రజలపై విద్యుత్ భారాలను మోపారు. ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి కరెంటు ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి మరిచిపోయారు. 2014 నుంచి వినియోగించిన విద్యుత్ ఛార్జీలకు ఇప్పుడు అదనపు ఛార్జీల వసూలు దారుణం. ప్రతి మూడు నెలలకోసారి ఛార్జీలు పెంచుతామని ప్రభుత్వం చెబుతోంది. దీన్ని తిప్పికొట్టాలి. విద్యుత్‌రంగ సంస్కరణలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. అవసరమైతే మరో బషీర్‌బాగ్ ఉద్యమానికి సిద్ధంగా ఉండాలి.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

సమస్యల పరిష్కారమే జగనన్నకు చెబుదాం లక్ష్యం

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రజా సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపి వారిలో సంతృప్తి స్థాయి పెంపొందించేందుకు ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, డిఎస్‌పి కె.రవిమనోహరాచారి, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రజలు కలెక్టరేటు వరకు రాకుండా మండలంలోనే అధికారులతో కలిసి పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. జిల్లాలో ప్రతి బుధ, శుక్రవారాల్లో మండలస్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మొత్తం 11 అర్జీలు వచ్చాయని, ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీదారులతో మాట్లాడి సెల్ఫీ తీసుకుని, తగిన విచారణ నిర్వహించి, నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి మండలంలో జగనన్నకు చెబుదాం పెండింగ్ అర్జీలతోపాటు, రీఓపెన్ కేసులు, అసంతృప్తి కేసులకు సంబంధించి అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. పెండింగు కేసులు అన్ని కూడా వెంటనే విచారించి సరైన సమాధానం పంపాలని జెసి ఆందేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, తహాశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, ఎంపిడిఒ వైఎన్ఎస్.ప్రసాద యాదవ్ పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పేదల గృహనిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేటులో గృహనిర్మాణం, ప్రాధాన్యత భవనాలు, నాడు-నేడు అంశాలపై జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. లక్ష్యసాధనలో వెనుకబడిన మండలాల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటికే పూర్తయిన గృహాల్లో మౌలిక వసతులను పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా సోప్ పిట్స్ నిర్మాణాలు, విద్యుద్దీకరణ, అంతర్గత రోడ్లు, తాగునీటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు, సిబ్బంది కషి చేయాలన్నారు. హౌసింగ్ ఎఇలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డిజిటల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులతో మాట్లాడి గృహనిర్మాణాలను ప్రోత్సహించాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్స్ పనితీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు పాఠశాలలు, అంగన్వాడీ భవనాలు, మరుగుదొడ్లు నిర్మాణ పనులు పూర్తయిన వాటికి జమ ఖర్చుల వివరాలను సమర్పించాలన్నారు. కొన్ని పాఠశాలల్లో పనుల ప్రగతి మందుకొండిగా ఉందని, వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ డాక్టర్ ఆర్‌సి.ఆనందకుమార్, డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు, డిఇఒ ఆర్.వెంకటరమణ, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతారాణి పాల్గొన్నారు

ఆచంట ఎంఎల్‌ఎ బినామీ ఎక్కౌంట్స్ నడిపారు

భారతీయ విద్యాభవన్స్ వ్యవహారాలపై జిల్లా రైస్‌మిల్లర్స్ ఆరోపణ

ప్రజాశక్తి - పాలకొల్లు

మాట్లాడుతున్న రైస్‌మిల్లర్స్ నేతలు

భారతీయ విద్యాభవన్స్‌కు సంబంధించి ప్రస్తుత ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు గతంలో బినామీ ఖాతాలు నడిపారని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు ఆరోపించారు. పాలకొల్లు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం జిల్లా రైస్‌మిల్లర్స్ సమావేశం నిర్వహించారు. అనంతరం సభ్యులతో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 1998 నుంచి 2016 వరకు రైస్‌మిల్లర్స్ జిల్లా అధ్యక్షులుగా ఉన్న చెరుకువాడ శ్రీరంగనాధరాజు మిల్లర్స్‌కు తెలియకుండా భారతీయ విద్యాభవన్స్ పేరిట బినామీ ఖాతాలు నడిపారన్నారు. చెరుకువాడ ఎంఎల్‌ఎ కావడంతో తాను జిల్లా అధ్యక్షులుగా ఉన్నానని చెప్పారు. అయితే విద్యాభవన్స్ బాధ్యతలు, ఎక్కౌంట్స్ తనకు అప్పగించకపోవడంతో అనుమానం వచ్చి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయగా విస్తుపోయే నిజాలు బయటపడినట్లు చెప్పారు. భారతీయ విద్యాభవన్స్‌కు 12 మంది రైస్‌మిల్లర్స్ సభ్యులుగా ఉండగా ముగ్గురు తమకు ఇష్టం లేక తప్పుకున్నట్లు ఉందని, మిగిలిన 9 మంది కూడా దశల వారీగా రాజీనామా చేసినట్లు, వారి స్థానంలో ఎంఎల్‌ఎ కుమారుడు, మేనల్లుడు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత, వారికి కావలసిన బినామీ పేర్లు ఉన్నట్లు చెప్పారు. దీనిపై ఆ 12 మంది సభ్యులను సంప్రదించగా తమకు విషయం తెలియదని రాతపూర్వకంగా చెప్పినట్లు వివరించారు. రైస్‌మిల్లర్స్ పిల్లలు, స్టాఫ్, ఇతర మెరిట్ విద్యార్థుల కోసం 1982లో భీమవరంలో 250 మంది మిల్లర్లు భారతీయ విద్యాభవన్స్ స్కూల్ పెట్టినట్లు, తరువాత పాలకొల్లు, తాడేపల్లిగూడెంల్లో పెట్టినట్లు చెప్పారు. దీంతో భవిష్యత్తులో భవన్స్ స్కూళ్లు పాడవకుండా వ్యక్తులు లేకపోయినా సొసైటీ ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఎంఎల్‌ఎ ప్రస్తుతం రైస్‌మిల్లర్ కాకపోయినా తాము రైస్ మిల్లర్స్ కాదని చెబుతున్నారని, అందుకే వారివద్ద భారతీయ విద్యాభవన్స్ 250 మంది జాబితా బహిర్గతం చేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పాలకొల్లు సంఘ అధ్యక్షులు ధర్మరాజు, జడ్డు గాంధీబాబు, పోలిశెట్టి దాసు, చవ్వాకుల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణే కాదు.. సమాజ సేవలోనూ ముందుకు

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి, కార్యదర్శి గోపీమూర్తి, లక్ష్మీరాజా - 1న విజయవాడలో స్వర్ణోత్సవ సభకు ఉపాధ్యాయులంతా తరలిరావాలి

ప్రజాశక్తి - భీమవరం

విద్యారంగ పరిరక్షణకు ఉద్యమాలు చేయడంతోపాటు సమాజానికి సేవ చేయడంలోనూ యుటిఎఫ్ ముందుందని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా అన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా రాష్ట్రవ్యాప్త స్వర్ణోత్సవ సంబరాల ప్రారంభ సభ అక్టోబర్ 1న విజయవాడలో నిర్వహించనున్నామని, దీనికి ఉపాధ్యాయులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలో ఈ నెల 21న యుటిఎఫ్ చేపట్టిన 50 ఏళ్ల స్వర్ణోత్సవాల ప్రచార జాతా చించినాడ వద్ద పశ్చిమగోదావరి జిల్లాలోకి బుధవారం ప్రవేశించింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ కార్యకర్తలు, నాయకులు ప్రచార యాత్రకు ఘన స్వాగతం పలికారు. నరసాపురం నుంచి పాలకొల్లు, వీరవాసరం, భీమవరం, అత్తిలి, తణుకు, తాడేపల్లిగూడెం మీదుగా సాగి ఏలూరు జిల్లాలోకి ప్రవేశించనుంది. భీమవరం యుటిఎఫ్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని యుటిఎఫ్ పూర్వపు నేత జేమ్స్, యుటిఎఫ్ పతాకాన్ని ఇజ్రాయేల్‌రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు గోపీమూర్తి, లక్ష్మీరాజా మాట్లాడారు. యుటిఎఫ్ 50 ఏళ్ల ప్రస్థానంలో అనేక ఆటుపోట్లు ఎదురైనప్పటికీ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగిందన్నారు. హక్కులు, బాధ్యతలు రెండు కళ్లుగా పెట్టుకుని రెండింటికి సమపాళ్లలో న్యాయం చేసినట్లు తెలిపారు. ఒకపక్క విద్యారంగాన్ని పరిరక్షించుకోవడంతోపాటు మరోపక్క ఉపాధ్యాయ బాధ్యతలకు న్యాయం చేయడం జరిగిందన్నారు. సమాజంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో యుటిఎఫ్ సామాజిక స్పృహ కనబరిచిందన్నారు. కరోనా కష్టకాలంలో రూ.3 కోట్లు సమకూర్చి పేదలకు అన్నం పెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ కార్యాలయాలను కరోనా ఐసోలేషన్ కేంద్రాలుగా మార్చి చికిత్స అందించిన విషయం గుర్తు చేశారు. విజయవాడలో అక్టోబర్ 1న స్వర్ణోత్సవ సంబరాల ప్రారంభ సభకు ఉపాధ్యాయులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఏడాది పొడవునా జరిగే స్వర్ణోత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ జాతాకు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం నాయకత్వం వహించారు. కార్యక్రమాల్లో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, కె.శ్రీదేవి, కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, కార్యదర్శులు పి.శివప్రసాద్, జి.లక్ష్మీనారాయణ, కెఎస్‌సిహెచ్.సాయిరాం, పి.క్రాంతికుమార్, కెఎస్.రామకృష్ణప్రసాద్, సిహెచ్.కుమార్‌బాబ్జి, పి.కృష్ణకుమారి, డి.ఏసుబాబు, ఎస్.రత్నరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు జివివి.రామానుజరావు, సిహెచ్.కృష్ణమోహన్, ఎంవి.రాజశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కెవి.సత్యనారాయణ, నేతలు పులఖండం శ్రీనివాస్, జిఎస్ఎస్ఆర్.స్వామి, ఎంవి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం: స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి జిల్లా గౌరవాధ్యక్షుడు మార్కండేయులు అధ్యక్షత వహించారు. తొలుత జాతీయ పతాకాన్ని వై.స్వామినాయుడు, యుటిఎఫ్ పతాకాన్ని ఎస్.జయప్రభ ఆవిష్కరించగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, నేతలు ఎన్‌వి.సత్యనారాయణ. ఎస్.అజయ్‌కుమార్, మాణిక్యాలరావు, జితేంద్రఫణి, శ్రీనివాస్, పి.శ్యాంసన్ పాల్గొన్నారు.

వీరవాసరం: యుటిఎఫ్ స్వర్ణోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు ఎన్.భానుమూర్తి పతావిష్కరణ నిర్వహించారు. యుటిఎఫ్ సాధించిన విజయాలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సిపిఎస్‌కు జిపిఎస్ ప్రత్యామ్నాయం కాదన్నారు. అందరికీ ఆమోదయోగ్యం ఓపిఎస్ మాత్రమేనన్నారు. ప్రాథమిక పాఠశాలల విచ్ఛిన్నానికి కారణమైన జిఒ నెం.117ను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన స్వర్ణోత్సవాల ప్రచార జాతాలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామానుజరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, ఉపాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి సిహెచ్.కుమార్ బాబ్జి, మండల అధ్యక్ష కార్యదర్శులు జివి.రమణ, ముద్రగళ శ్రీనివాస్, డి.పుల్లారావు, కె.నాగమునేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకులో..

పాలకొల్లు: యుటిఎఫ్ జాతా పాలకొల్లు చేరింది. పాలకొల్లులో సీనియర్ నేత వలవల శ్రీరామ్మూర్తి జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు త్రినాథ్, గుబ్బల సిద్దయ్య, రాంజీ అంబేద్కర్, లక్ష్మీనారాయణ, వెంకన్న, జెజె.దుర్గారావు, యర్రా అజయ్, జగ్గారావు, పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తణుకురూరల్: ఉపాధ్యాయుల హక్కులతోపాటు సమాజంలో సమస్యల పరిష్కారానికీ యుటిఎఫ్ పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. యాత్ర స్థానిక యుటిఎఫ్ కార్యాలయం వద్దకు చేరుకున్న సందర్భంగా సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ఎ.మాణిక్యమ్మ, జి.రవి, కొడమంచిలి కిరణ్‌కుమార్, పిల్లి విష్ణుమూర్తి, టెన్నిసన్‌రాజు, ఆర్ కర్నేలు, టిజె జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: యుటిఎఫ్ ప్రచార జీపు జాతా స్థానిక ఎఫ్‌సిఐ రోడ్డులోని యుటిఎఫ్ కార్యాలయం వద్దకు బుధవారం రాత్రి చేరుకుంది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. ముత్యాల రామకృష్ణ జెండా ఆవిష్కరించారు.

పాలకొల్లులో..

కౌలురైతులకు రుణాలందించాలి

ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

వినతి అందిస్తున్న నేతలు

భూయజమాని, బ్యాంకు రుణంతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులందరికీ ఎటువంటి షరతులూ లేకుండా పంట రుణాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. కౌలురైతులకు బ్యాంకు రుణాలు అందించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లోని జిల్లా లీడ్ బ్యాంకు కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో పంటలు పండిస్తున్న కౌలురైతులు, పేదరైతులు నాట్లు పూర్తి చేసి పంటకు పెట్టుబడి పెడుతున్నారన్నారు. ఎటువంటి ఆధారమూ లేని కౌలురైతులు పంట పెట్టుబడులకు ప్రయివేటు వ్యక్తులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో సిసిఆర్‌సి కార్డులు పొందిన కౌలురైతులు పంట పెట్టుబడికి ఆసరాగా బ్యాంకు రుణం పొందేందుకు బ్యాంకులకు వెళ్తే భూయజమానికి రుణం ఉంటే కౌలురైతులకు పంట రుణం ఇవ్వననడం దారుణమన్నారు. కొంతమంది బ్యాంకు అధికారులు అనేక షరతులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 84,185 మందికి కౌలు కార్డులు ఇచ్చామని గొప్పలు చెబుతున్నా 34975 మందికే రుణాలిచ్చారన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్, లీడ్ బ్యాంకు మేనేజర్, కలెక్టరేట్ కార్యాలయ ఎఒలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, నాయకులు, కె.శ్రీనివాస్, పి.జార్జిబాబు, వై.నారాయణమూర్తి, పి.కామేశ్వరరావు, కె.పెద్దిరాజు, జె.రంగారావు, జి.నాగేంద్రకుమర్ పాల్గొన్నారు.

విహార యాత్రల ద్వారా మానసిక ప్రశాంతత

ప్రపంచ పర్యాటక లోగో ఆవిష్కరణ, సాహస వీరులకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జీవితంలో ప్రతిఒక్కరూ తీవ్రమైన ఒత్తిళ్లకు గురవుతున్నారని, విహార యాత్రల ద్వారా పర్యాటక కేంద్రాలు సందర్శిస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని, మనదేశంలో అనేక పర్యాటక కేంద్రాలున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఛైర్మన్, ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ వి.సోమరాజు అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక, యూత్ హాస్టల్స్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో సోమరాజు కాన్ఫరెన్స్ హాల్లో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రెక్కింగ్ సాహస వీరులను, యూత్ హాస్టల్స్ సీనియర్లను బుధవారం సత్కరించారు. యూత్ హాస్టల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మట్లపూడి సత్యనారాయణ మాట్లాడుతూ విహారయాత్ర పర్యాటకులకు యూత్ హాస్టల్స్ చేయూత అనే అంశంపై వివరించారు. యూత్ హాస్టల్స్ గౌరవ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మనకు పర్యటక కేంద్రాలుగా పంచారామ క్షేత్రాలు, పట్టిసీమ, పాపికొండలు, గోదావరి పరివాహక ప్రాంతాలున్నాయన్నారు. మన జిల్లా యూత్ హాస్టల్స్‌లో సభ్యులుగా ఉంటే ఈ విహార యాత్రలకు కొన్ని రాయితీలు ఉంటాయన్నారు. యూత్ హాస్టల్స్ సీనియర్ సభ్యులు బోణం పాండురంగారావు, డాక్టర్ కట్రెడి సత్యనారాయణ, జ్ఞానపాటి మధుసూదనరావు, బొండా శ్రీరామ్, కట్రెడ్డి వెంకటరత్నం యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ద్వారా ఎన్నో విహారయాత్రలు నిర్వహించామని తెలిపారు. ప్రపంచ పర్యాటక లోగోను సోమరాజు ఆవిష్కరించారు. అనంతరం డిఎన్ఆర్ ఎన్‌సిసి క్యాడెట్ సిహెచ్.హేమసుందర్, టి.ఉమామహేష్‌నాయుడు, డాక్టర్ సోమరాజును సత్కరించారు. శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎఒ బి.సురేష్ పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - గణపవరం

రైతులు పొలంబడి కార్యక్రమం ద్వారా అవగాహన పెంచుకొని తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు బుధవారం అప్పన్నపేటలో జరిగిన వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచి నక్క సూరి బంగారయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా ఆరోగ్యమైన సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత అన్నదాతలపై ఉందన్నారు. ఎక్కువ మోతాదులో ఎరువులు వాడితే పంట దిగుబడి తగ్గుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయం వలన ఖర్చు తగ్గి ఆరోగ్యమైన పంటలు పండించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యంతో పాటు భూమిని కూడా కాపాడుకోవచ్చని చెప్పారు. నేడు ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండల ఛైర్మన్ కైగాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి జె.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ పి.లక్ష్మి, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

రోడ్డు నిర్మించాలని నిరసన

ప్రజాశక్తి - పోడూరు

గుమ్మలూరు పెట్రోల్ బంక్ నుంచి పాలకొల్లు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైందని, దీంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారని, తక్షణం రోడ్డు నిర్మించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ బుధవారం రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి ముందు గోతులు పూడ్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని, లేకపోతే రానున్న రోజుల్లో ఆర్అండ్‌బి కార్యాలయాన్ని మాల మహానాడు ఆధ్వర్యంలో మిగతా ప్రజా సంఘాలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు చిల్లే రాజ్‌కుమార్, కోలాటి ప్రసాదరావు, కోరం రాహుల్ పాల్గొన్నారు.

దూళ్లచెరువు ఆక్రమణలను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో జల్లికాకినాడ గ్రామ పంచాయతీకి చెందిన దూళ్ల చెరువును ప్రయివేటు వ్యక్తులు ఆక్రమించకుండా నిలుపుదలచేయాలని అంబేద్కర్ ఇండియన్ మిషన్ నాయకులు మేడెపల్ల దావీదు, మండల కన్వీనర్ బాతు నరేష్‌కుమార్, కోకన్వీనర్ ప్రసన్నకుమార్, మేడెపల్లి సాయికృష్ణ బుధవారం విలేకర్లకు చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని దూళ్ల చెరువుని స్థానిక బిజెపి నాయకులు ఇందుకూరి అశోకచక్రవర్తి ఆధీనంలో ఉందని తెలిపారు. దాన్ని 2021లో పంచాయతీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే చెరువుపై వచ్చే ఆదాయం పంచాయతీ దక్కనివ్వకుండా గణపవరం ఎంపిడిఒ జ్యోతిర్మయి పెద్దలకు కొమ్ముకాస్తున్నారని తెలిపారు. చెరువును బహిరంగ వేలంపాట వేసి వచ్చే ఆదాయం పంచాయతీకి చెందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాకాని పక్షంలో కలెక్టరేట్, ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చెప్పారు. ఎంపిడిఒ వివరణ ఇస్తూ గ్రామంలో దూళ్ల చెరువు విషయంలో పంచాయతీ బోర్డు తీర్మానం ఇవ్వాలని కోరామని, ఇంతవరకూ తీర్మానం ఇవ్వలేదని చెప్పారు. చెరువు విషయం బోర్డు సభ్యులకు తెలియకుండా వారి దగ్గర నుంచి సంతకాలు తీసుకున్నట్లు చెప్పారు. తనకు బోర్డు తీర్మానం అందితే చర్యలు చేపడతామని చెప్పారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా భగత్‌సింగ్, రాయ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దేశంలో గొప్ప దేశభక్తులుగా, మానవతావాదులుగా, మేధావులుగా భగత్‌సింగ్, రాజా రామ్మోహన్‌రాయ్ చరిత్రలో నిలిచిపోతారని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా వైద్య కేంద్రానికి చెందిన వి.రాధాకృష్ణ అన్నారు. భగత్‌సింగ్ జయంతి, రాజా రామ్మోహన్‌రాయ్ వర్థంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం వద్ద వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ షాహిద్ భగత్ సింగ్ చరిత్రలో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. వైసిపి కన్వీనర్ తోట భోగయ్య మాట్లాడుతూ భగత్ సింగ్ చిన్న వయసులోనే స్వాతంత్రం కోసం పోరాడి ప్రాణాలు బలి ఇచ్చారని తెలిపారు. దేశ ప్రజలు ఎప్పుడూ ఆయనకు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కామన నాగేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు ఇంటి సత్యనారాయణ, మెంటేవారితోట యూత్, వైద్య సహాయ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

తణుకురూరల్: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో యువత నిరుద్యోగంపై ఉద్యమించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. బుధవారం అమరవీరుల భవనం వద్ద భగత్‌సింగ్ జయంతిని సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో భగత్‌సింగ్ పాత్ర ఎప్పటికీ ఆదర్శమన్నారు. భగత్‌సింగ్ కన్న కలలు 77 ఏళ్లు అయినా సాకారం కాలేదన్నారు. వాటికోసం సిపిఎం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు గోపి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాంటిస్సోరీలో చెస్ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉల్లంపర్రు మాంటిస్సోరీస్‌లో ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్ల విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ఈనెల 28న పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో జరిగే యూత్ సర్వీసు మంత్ చివరి రోజున జరిగే వారోత్సవంలో అందజేస్తామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ రావు తెలియజేశారు. కార్యక్రమంలో రోటరీ యూత్ సర్వీస్ డైరెక్టర్ మద్దాల వాసు, క్లబ్ సెక్రటరి రావాడ సతీష్ పాల్గొన్నారు.

రైతులకు ఎలుకల మందు అందజేత

ప్రజాశక్తి - కాళ్ల

సామూహిక ఎలుకల నివారణలో భాగంగా రైతులకు బ్రోమోడయోలిన్ మందును ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేసినట్లు ఎఒ చామర్తి జయావాసుకి తెలిపారు. మండల పరిధిలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు, కౌలు రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. బొండాడలో ఎంపిపి పి.శిరీష విశ్వనాథరాజు చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, మన్నే నాగరాజు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెనుగొండ : ఎలుకల నివారణ చర్యల్లో భాగంగా వడలిలో ఎఒ రైతులతో మాట్లాడారు. ఎలుకల నివారణా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ సర్పంచి కాసాని విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

15 శాతం డివిడెండ్ పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

రైతులకు సంఘం లాభాల్లో 15 శాతం డివిడెంట్ పంపిణీ చేస్తున్నామని సొసైటీ ఛైర్ పర్సన్ మోటిపల్లి రామ భాస్కరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం మొగల్తూరులోని సొసైటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో జమా ఖర్చులను తెలిపారు. గత సంవత్సరం రూ.12 కోట్ల 72 లక్షల 22 వేల టర్నోవర్ నిర్వహించామన్నారు. 3600 మంది సభ్యులు ఉన్నారని, వారిలో 2200 మంది రుణాలు తీసుకున్నారని తెలిపారు. షేర్ క్యాపిటల్ రూ.82.62 లక్షలని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో వ్యాపార లావాదేవీల ద్వారా సంఘం రూ.31.35 లక్షల లాభాలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ కొత్తపల్లి గోవిందరాజులు, రేవు రాంబాబు, రైతులు కొల్లాటి ములస్వామి, తన్నీడి గిరి పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ల వద్ద ధర్నా : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - తణుకురూరల్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ల వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టనున్నట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిఒ 117ను రద్దు చేసి పాఠశాల విలీన ప్రక్రియను నిరోధించాలని, ప్రాథమిక పాఠశాలలను రక్షించాలని, సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

థియేటర్లలో జేబుకు చిల్లే..!

అధికంగా టిక్కెట్లు, తినుబండారాల ధరలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మొగల్తూరు

వినోదం పేరుతో సగటు సినీ ప్రేక్షకుడి నుంచి డబ్బులు దండుకుంటున్నారు. వినోదం కోసం సినిమా థియేటర్లకు వెళ్లిన ప్రేక్షకులకు అక్కడ విక్రయించే తినుబండారాల ధరలను చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. థియేటర్ల స్థాయిని బట్టి ధరల మోత మోగుతున్నాయి. సినిమా టిక్కెట్లు కంటే స్నాక్స్, పాప్‌కార్న్, టీ, కాఫీ, కూల్ డ్రింక్స్ ధరలే అధికం. మొగల్తూరులోని సినిమా థియేటర్లలో టిక్కెట్ విక్రయాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. థియేటర్లో టిక్కెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. సినిమా థియేటర్ల క్యాంటీన్లలో విక్రయించే తినుబండారాల ధరలు ఎక్కువే. ఇంటర్వెల్ సమయంలో ప్రేక్షకులకు పది నిమిషాల పాటు విరామం ఉంటుంది. ఆ సమయంలో క్యాంటీన్లకు వచ్చి తినుబండారాలు కొనుగోలు చేస్తుంటారు. అయితే క్యాంటీన్లలో విక్రయించే ధరలు, బయట దొరికే రేట్లకు ఏ మాత్రం పొంతన లేదు. దీంతో సగటు సినీ ప్రేక్షకుడి జేబు ఖాళీ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో నలుగురు సభ్యులున్న కుటుంబం సినిమాకు వెళ్తే కనీసం రూ.వెయ్యి ఖర్చవుతోంది. తినుబండారాలు, రాను పోను దారి ఖర్చు అదనంగా అవుతుంది. అదే ప్రత్యేక రోజుల్లో సినిమా రిలీజ్‌లకు వెళితే దానికి మరో ధర. బడా హీరోల సినిమా రిలీజ్ అయితే థియేటర్లో రూ.500 నుంచి రూ.1000 రూపాయలకు టిక్కెట్ విక్రయిస్తున్నారు. ఒక మోస్తరు సినిమాకు హిట్ టాక్ వస్తే రూ.150 పైబడే టిక్కెట్లు విక్రయిస్తున్నారు. అయితే థియేటర్లో దోపిడీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం గమనార్హం. థియేటర్లోని టాయిలెట్ల నిర్వహణ సరిగ్గా ఉండని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా దుర్వాసన వెదజల్లుతోంది.

మొగల్తూరులోని సినిమా థియేటర్

పైలెట్ ప్రాజెక్టుకు వ్యతికేంగా ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట ది మృత్యుంజయ విశాల సహకార పరపతి సంఘంలో ఖాతాదారులు, సంఘం సభ్యుల అభిప్రాయానికి విరుద్ధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన నిర్ణయం వల్ల సహకార సంఘం మనుగడ ప్రశ్నార్థకం మారిందని సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మృత్యుంజయ విశాల సహకార పరపతి సంఘం బుధవారం సాధారణ మహాసభ చైర్ పర్సన్ ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ మహాజన సభ ప్రారంభం ముందుగానే ఎజెండాలో పొందుపర్చిన 10వ అంశంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వరల్డ్ లార్జెస్ట్ గ్రైన్ స్టోరేజ్ ఇన్‌ఫ్రస్ట్రక్చర్ ప్రాజెక్టుపై సభ్యులంతా అధికారులపై ముకుమ్మడిగా ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో ఆచంట సొసైటీకి ప్రాజెక్టు మంజూరైంది. దీంతో ఎటువంటి ఉపయోగం లేదంటూ సొసైటీ సభ్యులు, రైతులు గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రాజెక్టుకు సంబంధించి పనులు నిలుపుదల చేయాలంటూ కోర్టు స్టే ఇచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన సాధారణ మహాజన సభలో సంఘం సభ్యులు సహకార పరపతి సంఘానికి ఒక రైస్ మిల్లు ముద్దు, రెండోది వద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సభను సుమారు అరగంట వాయిదా వేసి తిరిగి ప్రారంభించారు. ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టు వల్ల లాభాల్లో ఉన్న సొసైటీ కొన్ని దివాలా తీసే డిపాజిట్ దారులకు భంగపాటు తప్పదని సభ్యులు తెలిపారు. ప్రభుత్వం నిర్మించే ఆధునిక రైస్ మిల్లు, గోడౌముల వల్ల ఇక్కడ ప్రజలకు ఫలితం లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికే ఉన్న రైస్ మిల్లు నష్టాల బాటలో నడుస్తోందని, దీనికితోడు కేంద్ర ప్రభుత్వ పైలెట్ ప్రాజెక్టు తీసుకురావడంతోపాటు అప్పటి సంఘం కమిటీ సభ్యులు చేత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో బలవంతంగా సంతకాలు చేయించుకోవడం, అనంతరం జరిగిన పరిణామాల్లో సంఘం సభ్యులను తొలగించి స్పెషల్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. వీరిలో కమిటీ సభ్యులుగా ఎస్.శ్రీనివాసరావు, ఛైర్ పర్సన్‌గా (అసిస్టెంట్ రిజిస్ట్రార్) కె.జోసెఫ్, పాల్ పర్సన్స్ (అసిస్టెంట్ రిజిస్ట్రార్) ఇ.నాగేశ్వరరావు పర్సన్ (డిసిసిబి భీమవరం బ్రాంచ్ మేనేజర్) కమిటీ సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ పైలెట్ ప్రాజెక్టును సంఘ సభ్యులందరూ ఏకగ్రీవంగా తిరస్కరించిన ప్రభుత్వ మాత్రం పట్టుదలతో ముందుకు వెళ్లడంతో అభివృద్ధి నాయకులు హైకోర్టును ఆశ్రయించి కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌లో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులను తాత్కాలిక నిలుపుదల చేయాలని తీర్మానించినట్లు అభివృద్ధి నాయకులు తెలిపారు. ఆచంట సహకార సంఘానికి స్థలం అందుబాటులో ఉందంటూనే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం ఎంపిక చేసింది. దీంతో స్థలం సేకరణ సమస్య లేకపోవడంతో సొసైటీలో డిపాజిట్ పెద్ద మొత్తంలో ఉండటం ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితిలో ఇక్కడ ఏర్పాటు చేయాలన్న తలంపులో ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సొసైటీ త్రిసభ్య కమిటీని రద్దుచేసి ముగ్గురు ప్రత్యేక అధికారులతో ప్రాజెక్టును ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రభుత్వం చొరవచూపుతోంది. ఇప్పటివరకూ ఆ ప్రాజెక్టు కోసం ఎంత ఖర్చు పెట్టినా ప్రభుత్వమే భరించాలని సొసైటీకి ఏమాత్రమూ సంబంధం లేదని సంఘ సభ్యులు ముక్తకంఠంతో తీర్మానించారు. అనంతరం ఎజెండాలో ఉన్న పలు అంశాలను సభలో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కెవి.రమణమూర్తి, జె.వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి ముఖ్య కార్యనిర్వహణాధికారి వేంద్ర విష్ణుమూర్తి పాల్గొన్నారు.

మహాజన సభలో అధికారులను ప్రశ్నిస్తున్న సంఘం సభ్యులు

అంగన్‌డీలపై నిర్బంధకాండ సరికాదు

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కళ్యాణి

ప్రజాశక్తి - పాలకోడేరు

అంగన్‌వాడీలపై నిర్బంధ కాండ సరికాదని, సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, సిఐటియు నాయకులు శ్రీను అన్నారు. ఈ నెల 25న అంగన్‌వాడీ కార్యకర్తల అరెస్టులకు, నిర్బంధానికి వ్యతిరేకంగా విస్సాకోడేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీసం తమ సమస్యలను వినే పరిస్థితుల్లో ప్రభుత్వం లేకపోవడం దారుణమన్నారు. మహిళలని చూడకుండా ఎక్కడికక్కడ నోటీసులు ఇచ్చి అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. విజయవాడ ధర్నాకు వెళ్లకుండా నిర్బంధం విధించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ సమస్యలపై స్పందించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా రూ.వెయ్యి ఎక్కువ వేతనం ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి, దుర్గ, విజయలక్ష్మి, సీతారత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విస్సాకోడేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వద్ద నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

కొనసాగిన టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబుపై అక్రమ కేసులు నిరసిస్తూ భీమవరం జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో బుధవారం తెలుగు యువత నియోజకవర్గ నాయకులు పాల్గొని అర్థనగ్న ప్రదర్శన చేపట్టారు. నిరాహార దీక్షా శిబిరం వద్ద టిడిపి నాయకుడు షేక్‌వలీ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతోషం వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపల్లి వెంకట్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల నాగబాబు మాట్లాడారు. నిరాహార దీక్షలో నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి కాసాని రామాంజనేయులు, మండల అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి, ఉపాధ్యక్షుడు వీరమల్లు వెంకట్ పాల్గొన్నారు.

ఆచంట : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు పితాని వెంకట్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 15వ రోజు బుధవారం కొనసాగాయి. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి మాట్లాడుతూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు గొడవర్తి శ్రీరాములు, బలుసు శ్రీరామ్మూర్తి, నెక్కంటి ప్రభాకర్, కేతా మురళి, బాలాజీ, చిలుకూరి సీతారాం బీరా నరసింహమూర్తి. సుధాకర్ పాల్గొన్నారు.

పోడూరు : చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ మండల ఎస్‌సి సెల్ అధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ ఆర్‌వి కృష్ణారావు, ఆర్ఐ కందుల రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు కొండేటి చల్లారావు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎల్లమెల్లి వెంకటరావు, నామవరపు రవికుమార్, ఉండ్రు లింగ మూర్తి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : చంద్రబాబును జైలు నుంచి విడుదల చేయాలని కోరుతూ టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు పిలుపుమేరకు ఎస్‌సి కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు ముప్పిడి రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌సి నాయకులు తహశీల్దార్ వై.దుర్గా కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీతల సత్యనారాయణ, శీలి వెంకటాచలం, మెరుపో సంతోషరావు, చీకట్ల శాంసన్, గరపాక మూర్తి పాల్గొన్నారు.

ఉండి : ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు చంద్రబాబు వైపే ఉంటారని టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు గొల్ల జాన్ కెనడీ, విక్టర్ బాబు, ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షులు సాలా మల్లేశ్వరరావు, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మూసానాయన అన్నారు. టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ సభ్యులు చంద్రబాబుకు మద్దతుగా కళ్లకు గంతలు కట్టుకుని దీక్షను కొనసాగించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

ఆకివీడు : చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఇంటింటికీ వెళ్లి టిడిపి నేతలు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు మోటుపల్లి రామ్ వరప్రసాద్, కోట్ల రామారావు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక నాయకులు, కార్యకర్తలు బుధవారం రాత్రి నిరసన ప్రదర్శన నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి సెల్ ఫోన్ల టార్చ్ లైట్లతో పట్టణంలో పాత బస్టాండ్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి మండల అధ్యక్షులు మోటిపల్లి రాం వరప్రసాద్ నాయకత్వం వహించారు.

ఆకివీడులో నిరసన తెలుపున్న టిడిపి నేతలు

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - పోడూరు

టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ అన్నారు. బుధవారం భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం మినిమించిలిపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ టిడిపి ప్రకటించిన మినీ మేనిఫెస్టో ద్వారా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మాజీ జెడ్‌పిటిసి బొక్క నాగేశ్వరరావు, రుద్దరాజు రవిరాజు, రమేష్ రాజు, దొంగ సూర్య ప్రసాద్ పాల్గొన్నారు.

ఉండి తహశీల్దార్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉండి

ఉండి తహశీల్దార్‌గా ఏడిద శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామి నాయుడు ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఇరగవరం తహశీల్దార్‌గా పని చేసి అక్కడ నుండి నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎఒగా పనిచేసినట్లు తెలిపారు. సహచర అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

డిసిఎంఎస్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టూ టౌన్‌లోని డిసిఎంఎస్ కార్యాలయంలో భీమవరం వ్యవసాయ శాఖ ఎడిఎ సిహెచ్.శ్రీనివాస్ రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ డిసిఎంఎస్ పరిధిలోని ఐదు సొసైటీల రికార్డులు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీలో ఎరువులు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించామని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

తణుకురూరల్: ప్రధానోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిఇఒ ఆర్.వెంకటరమణకు ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష గౌరవాధ్యక్షులు నేలపాటి వెంకటరమణ, ఎంఎన్ శ్రీమన్నారాయణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాడు-నేడు పనులు చేసిన వేసవి కాలానికి సంబంధించి సంపాదిత శెలవు కోసం సిఎస్ఇ తో మాట్లాడి మేలు చేయాలన్నారు. జూన్ 18న కౌన్సిలింగ్ ద్వారా బదిలీపై ఎంఇఒ-2లుగా వచ్చిన వారికి జీతాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు విద్యుత్ మోటార్ అందజేత

పాలకొల్లు: చినపేటలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు పాలకొల్లు హెచ్‌ఎం రాయపూడి భవాని ప్రసాద్ ప్రోత్సాహంతో చినగోపురం ట్రస్ట్ మాజీ ఛైర్మన్ గాదె వెంకన్న ఆర్థిక సహాయంతో రూ.8000 విలువచేసే ఎలక్ట్రికల్ మోటార్, ట్యూబ్ లైట్లు బుధవారం అందించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు దాతల సహకారం వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చొప్పల రజిని, పిఎంసి ఛైర్మన్ పి.జయరాజు, పాఠశాల హెచ్‌ఎం ఉన్నమట్ల చిన్నయ్య పాల్గొన్నారు.

సమస్యలు చెప్పినా పట్టించుకోరు

సమావేశంలో టిడిపి, జనసేన సభ్యుల నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు

ఒకే ఒక్క అంశం అజెండాగా స్థానిక నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం బుధవారం 20 నిమిషాల్లో ముగిసింది. ఈ సమావేశానికి టిడిపి, జనసేన సభ్యులు నోటికి నల్ల గుడ్డలు కట్టుకుని హాజరయ్యారు. ఈ 99 వేల రూపాయలు విలువైన ఒక టెండర్ ఆమోదించడానికి మాత్రమే సమావేశం జరిగింది. తాము ప్రస్తావించిన సమస్యలను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని, పాలకవర్గాన్ని ఒక రకంగా ప్రతిపక్షాన్ని ఒక రకంగా చూస్తున్నారని టిడిపి, జనసేన సభ్యులు విమర్శించారు. అందుకే తాము నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు.

మా వార్డులో సమస్యలు పరిష్కరించరా..

'మేం ప్రజా ప్రతినిధులమే కాదా, మా వార్డు ప్రజలకు సమస్యలండవా, ఆ సమస్యలు పరిష్కారానికి నోచుకోవా' అంటూ టిడిపి, జనసేన నాయకులు, కౌన్సిలర్లు కమిషనర్ ఎం.కృష్ణమోహన్‌ను నిలదీశారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ పాలకవర్గ సమావేశం అనంతరం ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కౌన్సిలర్లు కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. తమ వార్డుల్లో ప్రజా సమస్యలకు పరిష్కారం దొరకదా అంటూ నిలదీశారు. దీనిపై తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామంటూ కమిషనర్ సమాధానం చెప్పారు.

బాలికల హాస్టల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి

ప్రజాశక్తి - ఉండి

బాలికల వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని ఉండి మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. బుధవారం మండల పరిషత్ అధికారి కార్యాలయంలో బాలికల వసతి గృహ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బాలికల వసతి గహాలలో మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా బాలికలచే మెడిటేషన్ చేయించాలన్నారు. ఎప్పటికప్పుడు మరుగుదొడ్లను శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఎం.చిత్రకుమారి, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అడబాల వెంకట అప్పారావు పాల్గొన్నారు.

'విద్యార్థి సంఘం నేతలను దొంగలనడం సిగ్గుచేటు'

ప్రజాశక్తి - ఆచంట

విద్యారంగ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్ వద్ద శాంతియుతంగా పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులపై పోలీసు యంత్రాంగాన్ని నిర్బంధ చర్యలకు పాల్పడడం, దొంగలంటూ నిందించడం సిగ్గుచేటని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ఎస్.శర్మ, జె.ధనుష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా శర్మ విలేకరులతో మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు పూర్తి కావస్తున్నా నేటికీ ప్రభుత్వ కళాశాలు, పాఠశాలల్లో పూర్తిస్థాయిలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు అందించడంలో విఫలమయ్యారని, తక్షణం విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు పెట్టి పరిష్కరించాలని, లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో విద్యార్థి, యువజనులు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

రైతులు ఇకెవైసి చేయించుకోవాలి

అత్తిలి: రైతులందరూ ఇ-పంట నమోదు చేయించుకుని, ఇకెవైసి చేయించుకోవాలని ఎఒ టి.రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకెవైసి ఈ నెలాఖరులోగా చేయించుకోకుంటే ధాన్యం కొనుగోలు, క్రాప్ ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం, రైతు భరోసా, పిఎం కిసాన్, ఇతర వ్యవసాయ సంబంధమైన పథకాలు వర్తించవని తెలిపారు. మండలంలోని రైతులందరూ రైతు భరోసా కేంద్రాల్లో ఇకెవైసి నమోదు చేయించుకోవాలని సూచించారు.

కాళ్లకూరు వెంకన్నకు రూ.15.80 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో 80 రోజులకు గాను హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. భీమవరం రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఇఒ దండు వెంకట కృష్ణంరాజు సమక్షంలో లెక్కింపు చేపట్టారు. మొత్తం రూ.15,80,107 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళా మండలి సభ్యులు, దేవస్థానం ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వినాయక లడ్డూ వేలం

కాళ్ల: వినాయక చవితి సందర్భంగా కాళ్లకూరులో అల్లూరి సీతారామరాజు యూత్ ఆధ్వర్యంలో వినాయకుని నిమజ్జనం బుధవారం నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు యూత్ ఆధ్వర్యంలో వినాయకుని ఊరేగింపు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా బుధవారం వినాయకుని లడ్డు వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన పొత్తూరి విష్ణువర్మ 15 కేజీల లడ్డూను రూ.26 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు పెన్మత్స కుమార్‌రాజు, అడ్డాల నాగరాజు పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బందికి సత్కారం

తాడేపల్లిగూడెం: సమాజంలో సేవలందిస్తున్న ఉద్యోగులు, సామాజిక సేవా తత్పరులకు అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ప్రోత్సాహం అందిస్తుందని లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ వార్డు సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలు బహూకరించారు. విధి నిర్వహణలో అహర్నిశలూ కష్టపడే వ్యక్తులుగా ప్రసంసిస్తూ, శ్రీనివాస్ సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా జోన్ ఛైర్ పర్సన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, క్లబ్ అధ్యక్షుడు కె.రమణయ్య మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి మద్దుకూరి మెహర్ ప్రసాద్, లయన్స్ ఎన్.రావు రంజిత్ పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు** బ్రాంచి వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **శ్రీమతి ముత్యాల తులసి** భర్త : ముత్యాల శ్రీనివాసరావు, వయస్సు : 44 సం॥, నివాసం : ఊటసముద్రం గ్రామం, చింతలపూడి మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి

పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి సబ్‌డివిజన్‌లో చేరిన చింతలపూడి మండలం, ఊటసముద్రం పంచాయితీలోని ఊటసముద్రం గ్రామం తాలూకా జిరాయితి మెరక ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థి నా భర్తగారు పూర్వార్జితం బాపతు ఆస్తి అయి వుండి అనగా లోగడ నా భర్తగారు కాకాని రాజు గారి మరణాంతరం శ్రీ ప్రభుత్వం వారిచే నా పేర ఇ. 267718 (పట్టా నెం. 18) రు గా నాపేర పట్టాదారు పాసు పుస్తకం భూమి యాజమాన్యపు హక్కు పత్రము మంజూరు కాబడి గ్రామ రెవిన్యూ లెక్కలో నా పేర 1బి అడంగల్ ఆన్‌లైన్ కాబడి తదాది నేటి వరకు నా సంపూర్ణ స్వాధీన అనుభవ హక్కు భుక్తములో గల జిరాయితీ మెరక రి.నెం. 127-8 రు దాఖలా, **డాక్యుమెంట్ నెం. 6071/2019** నాకు గల య. 1-02 ట్లలో ఉత్తరం వైపున నీకు సెటిల్‌మెంట చేసిన చ॥గ॥ 242లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు** : కాకాని జగపతి గారి భూమి, **పడమర** : సంగసాని తిరుపయ్య గారి స్థలం, **దక్షిణము** : కాకాని రాజు వగైరాల భూమి, **ఉత్తరం** : జిల్లా పరిషత్ రోడ్డు మార్జిన్

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం, సెల్ : 9849246278

ప్రకటన

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, చినఅమిరం గ్రామం, రమణ కుంజ అపార్ట్‌మెంట్, సెకండ్ ఫ్లోర్, ఫ్లాట్ నెం.102రు, కాపురస్తులు అల్లూరు సత్య కిషోర్ వర్మ గారి భార్య అల్లూరు రంగావతి, వయస్సు 46 సం॥లు గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది.

నా క్లయింటు అయిన అల్లూరు సత్య కిషోర్ వర్మ గారి భార్య అల్లూరు రంగావతి గారికి డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం పట్టణంలో ఖాళీ స్థలంలో బిల్డింగ్ కలదు. సదరు ఆస్తికి సంబంధించిన 1) ది.10-09-1979 సం॥ తేదీ నాటి ద.నెం. 3802/1979రు మరియు 2) ది.23-09-1980 సం॥తేదీనాటి ద.నెం.4411/1980రు గల రెండు ఒరిజినల్ లింకు దాస్తావేజులను నా క్లయింటు ది.18-09-2023 సం॥తేదీన ఒక కవరులో పెట్టుకొని చినఅమిరంలో ఆటో ఎక్కి భీమవరం జువ్వలపాలెం రోడ్డుకి వస్తుండగా మార్గమధ్యములో భీమవరం రెండవ పట్టణ పరిధిలో సదరు దస్తావేజులు పెట్టిన కవరు జారి పడిపోయినది. నా క్లయింటు పైన తెలియపర్చిన రెండు ఒరిజినల్ లింకు దస్తావేజులను పోగొట్టుకొనియున్నారు. నా క్లయింటు మరలా మార్గమధ్యములోనూ పరిసర ప్రాంతాలలో వెతికినారు దొరకలేదు. ఎవ్వరికైనా దొరికిన యెడల మా క్లయింటు అయిన అల్లూరు రంగావతి గారి అడ్రస్‌కు గాని వారి సెల్ నెం.**99494 00966**రు కు గాని తెలియపర్చగలరు.

బొక్కా చంద్రశేఖర రావు
అడ్వకేట్ & నోటరీ
తాలూకా ఆఫీసు ఎదురుగా,
భీమవరం-534 201, ప.గో॥జిల్లా.
సెల్ : 94911 72663

ప్రాంతం : భీమవరం
తేది : 27.09.2023